క్లుప్తంగా

కేంద్ర బలగాల కవాతు



ఎల్కతుర్తి : రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎస్సై సాయిబాబు ఆధ్వర్యంలో శనివారం భీమదేవరపల్లి మండలంలోని ధర్మారం, కొత్తకొండ, ముత్తారం, ముల్కనూరు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రలోభాలకు గురికావద్దని సూచించారు.

అంకితభావంతో పనిచేయాలి

ఆత్మకూరు : 108 సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని 108 జిల్లా అధికారి లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని 108, 102 వాహనాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వాహనాల్లోని పరికరాలను, మందులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్నందున సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆపద సమయంలో అండగా నిలవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్, ప్రకాశ్ ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగర పీఎస్ పరిధిలో గల ముల్కనూరు– వంగర ప్రధానరహదారిపై శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకుముందు పలు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు చల్లా నరసింహారెడ్డి, ఎల్లారెడ్డిల తండ్రి కట్టారెడ్డి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎల్లారెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన దుంపల వీరమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ విజయ్‌కుమార్, నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్ ఉన్నారు.

నేడు తాగునీటి సరఫరా వేళల్లో మార్పు

పరకాల : మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఉదయం తాగునీటి సరఫరా వేళ లను మార్చడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నర్సింహా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీఎంఎస్) వద్ద గేట్‌వాల్వ్ మరమ్మతుల దృష్ట్యా మధ్యాహ్నం నుంచి తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కావ్యను గెలిపించాలి

పర్వతగిరి : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన కడియం కావ్య గెలుపునకు శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు మంద కృష్ణ మాటకు కట్టుబడి ఉండరని చెప్పారు. వర్ధన్నపేట నుంచి మంద కృష్ణ పోటీ చేసినప్పుడు ఆయనకు దళితుల ఓట్లు ఎన్ని పడ్డాయో గుర్తు చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ నుంచి బీజేపీకి వలస పోయిన అరూరి రమేశ్‌కు నియోజకవర్గంలో దళితుల బలం పూర్తిగా తెలుసన్నారు. కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సమస్యల వలయంలో పీహెచ్‌సీ

- రెగ్యులర్ వైద్యుడు లేక తిప్పలు
- పల్లె డాక్టర్లే దిక్కు
- ఆర్‌ఎంపీ, పీఎంపీల హవా

వేలేరు : గ్రామీణ ప్రాంతాల్లోని పేదప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టులాడుతోంది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యుడు లేక ఆరు నెలలు గడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. పల్లె దవాఖానాల్లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు చేరో మూడు రోజుల చొప్పున పీహెచ్‌సీలో డ్యూటీ చేస్తూ నెట్టుకొస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ మూడు నెలల క్రితం డిప్యూటేషన్ పై టీ-హబ్‌కు వెళ్లడంతో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు దిక్కు లేకుండా పోయింది. వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వస్తున్న రోగులు అసహనం వ్యక్తం చేస్తూ ప్రైవేటు ఆస్పత్రులను, స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు ఆర్‌ఎంపీ, పీఎంపీలు రోగుల జేబుకు చిల్లు పెడుతున్నారు.

నిరుపయోగంగా వైద్య పరికరాలు



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వైద్యపరికరాలు ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో మూలనపడ్డాయి. దీంతో వివిధ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులు ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు అవసరం లేని టెస్ట్‌లు చేసి వేలల్లో డబ్బులు గుంజుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు.



తాళం వేసిఉన్న ల్యాబ్

డాక్టర్‌ను నియమించాలి



మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ లేక ఆరునెలలు అవుతుంది. డాక్టర్‌ను నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. అలాగే పీహెచ్‌సీకి వచ్చే డాక్టర్లు ఎవరు కూడా రెండు నెలలు కంటే ఎక్కువ పనిచేయడం లేదు. గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీ, పీఎంపీలు రోగుల నుంచి డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తూ అవసరపు టెస్టులు చేస్తున్నారు. టెస్ట్‌లు, మందుల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో ఆర్‌ఎంపీలే అధిక ధరలకు మందులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలు కల్పించి, డాక్టర్, సిబ్బందిని నియమించాలి.

- గడ్డమీది శంకరయ్య, సీపీఐ మండల కార్యదర్శి

ఆస్పత్రికి వస్తే డాక్టర్ లేడు



మాది పీచర గ్రామం. అనారోగ్యంతో వేలేరు దవాఖానాకు వస్తే డాక్టర్ లేడని ఇక్కడ పనిచేసే వాళ్లు చెబుతున్నారు. డాక్టర్ లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లకతప్పదు. అక్కడికి పోతే వారు అవసరంలేని టెస్టుల చేసి డబ్బులు తీసుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే స్థోమత లేకున్నా వెళ్లక తప్పదు. సర్కార్ దవాఖానలో డాక్టర్లు, అన్ని సదుపాయాలు ఉంటే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే అవసరం ఉండదు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డాక్టర్ ను నియమిస్తే మా లాంటి పేదవారికి ఎంతో నయం. వైద్య సేవలు అందించి పేదలకు అండగా నిలవాలి.

-కొయ్యడ వెంకటయ్య, పీచర

నైపుణ్యంతో అద్భుతాలు సృష్టించొచ్చు

- నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్

నర్సంపేట : విద్యార్థుల్లోని నైపుణ్యాలకు పదును పెడితే అద్భుతాలు సృష్టించొచ్చని స్థానిక ఏసీపీ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. పట్టణంలోని శ్రీ అభ్యాస్ హైస్కూల్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువు ఒక్కటే నేర్పించడం వల్ల పరిపూర్ణమైన విజ్ఞానాన్ని పొందలేరని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విజ్ఞాన సంగ్రహణ పరిధి పెరుగుతుందని, తద్వారా విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి పదును పెడితే అద్భుతాలను సృష్టించే సృష్టికర్తలవుతారని తెలిపారు. విజ్ఞాన దాహాన్ని తీర్చే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. స్కూల్ చైర్మన్ నరహరి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చదువులకే పరిమితం చేయకుండా కరాటే, యోగా, కర్రసాము, ఆర్చరీ, కోలాటం, సంగీతం, తదితరాల్లో శిక్షణ ఇప్పిస్తూ అన్ని రంగాల్లో ఉన్నతులుగా ఎదిగే దిశగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నరహరి స్వాతి రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కుమార్, ఏఓ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్మన్

బూత్ కమిటీల ఎన్నిక

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి, రాజుపల్లి, సాధోనిపల్లి, సూర్యనాయక్‌తండా, గంగిరేణిగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. ఆయా గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పెద్దకోడెపాక మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెపల్లి రవీందర్, కొమ్ముల భాస్కర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీల ఎన్నిక

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి, ఉడుతగూడెం, లింగమోరిగూడెం, రాంనగర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీలను శనివారం ఎన్నుకున్నట్లుగా మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు వెల్లడించారు. ఒంటిమామిడిపల్లి అధ్యక్షుడిగా మామిండ్ల సంపత్, ప్రధానకార్యదర్శిగా మజ్జిగ రాములు, యూత్ అధ్యక్షుడిగా గూడ సునీల్, ఉడుతగూడెం అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్, ప్రధానకార్యదర్శిగా తోట నరేష్, యూత్ అధ్యక్షుడిగా తాటికాయల శ్రీను, రాంనగర్ అధ్యక్షుడిగా ఉల్లంగుల అశోక్, ప్రధానకార్యదర్శిగా సురేందర్, యూత్ అధ్యక్షుడిగా సాగర్, లింగమోరిగూడెం అధ్యక్షుడిగా ఎస్‌కే జిందా, ప్రధానకార్యదర్శిగా ఎస్‌కే హుస్సేన్, యూత్ అధ్యక్షుడిగా హరీష్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహ కరించిన నాయకులకు నూతన కమిటీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : మండలంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఐనవోలు, వెంకటాపూర్ గ్రామాల వ్యవసాయ బోర్లకు, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు ఒంటిమామిడిపల్లి, వెంకటాపూర్ గ్రామాల వ్యవసాయ బోర్లకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ధర్మసాగర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఎన్పీడీసీఎల్ ఏఈ సుధాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా తాటికాయల, ఎల్కుర్తి 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అలాగే ధర్మసాగర్, పెద్దపెండ్యాల 11 కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంఠమహేశ్వర స్వామికి ఘనంగా బోనాలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలో గౌడ కులస్తులు శ్రీ కంఠమహేశ్వర స్వామికి శనివారం రాత్రి ఘనంగా బోనాలు సమర్పించారు. తొలుత స్థానిక గౌడ సంఘం అధ్యక్షుడు మర్ద సురేశ్ ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో పుర వీధుల మీదుగా డప్పుచప్పుళ్ల నడుమ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు, నాయకులు మచ్చిరాజు, మద్దెల సాంబయ్య, జూలూరి హరిప్రసాద్, కందుల శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోకుదెబ్బ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నర్సంపేట : పట్టణంలోని శాంతినగర్, టీచర్స్ కాలనీలోని శ్రీమాతంగి రాజశ్యామల నాగ అమృత లింగేశ్వర పంచాయతన ఆలయంలో అర్చకులు వెన్నంపల్లి నిశాంత్‌శర్మ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతోత్సవాల్లో భాగంగా శ్రీచక్రార్చన పూజ నిర్వహించగా వికాస తరంగిణి నర్సంపేట శాఖ ఆధ్వర్యంలో శ్రీ లలిత పారాయణం, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం శ్రీవెంకట సత్యనారాయణ శర్మ భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు, రంగనాథస్వామి, శ్రీధర్, మెరుగోజు రేణుక, సీపాన పద్మ, శ్యామల, స్వరూప, మనెమ్మ, కల్పన పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు చేయాలి

నర్సంపేట : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు చేయాలని దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, కోకన్వీనర్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్, గుంటి వీరప్రకాశ్ కోరారు. ఈ మేరకు వారు మున్సిపల్ కార్యాలయంలో అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో వెంకటేశ్వర్లు, ప్రణయ్‌దీప్, వీరప్రకాశ్ మాట్లాడారు. పట్టణంలో 134వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి రంగులు వేయడంతోపాటు పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. యువజన, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలతోపాటు సీనియర్ సిటిజన్స్, మహిళా సంఘాలు, కార్మిక సంఘాలు పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ, మాల మహానాడు రాష్ట్ర కమిటీ సభ్యుడు గంజి లక్ష్మీనారాయణ, జిల్లా ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ధార గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సైబర్ మోసాలపై అవగాహన కలిగిఉండాలి

హన్మకొండ: విద్యార్థులు బాలల హక్కులు, సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్ కుమార్ సూచించారు. హనుమకొండ సుబేదారిలోని ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో యూత్ అడ్వకేట్స్‌కు అడ్వకసీ యాక్షన్ అండ్ ఎస్ఆర్‌హెచ్‌ఆర్ అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు విద్యార్థులు మొబైల్ ఫోన్‌కు అలవాటుపడి ఆన్‌లైన్ గేమ్స్, ఇతర ఆప్స్‌లు డౌన్లోడ్ చేసుకొని అనేక సమస్యల్లో చిక్కుకుంటున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లు క్లిక్ చేసి మోసపోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లలను గుర్తించి వారి సమాచారాన్ని చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు కాల్ చేయాలన్నారు.

జ్ఞానాన్ని అందించే విధంగా పుస్తక రచన

హన్మకొండ కల్చరల్ : జ్ఞానాన్ని అందించే విధంగా పుస్తకరచన చేయడం కొందరికే సాధ్యమవుతుందని, టెక్ట్స్ బుక్ ఆన్ క్లినికల్ రీసెర్చ్ పుస్తకం మెడికల్, ఫార్మసీ విద్యార్థులకు ఉపయోగకరంగా పుస్తకాన్ని వెలువరించడం అభినందనీయమని వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం హనుమకొండలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో వాగ్దేవి కళాశాల ఫార్మ్‌డి హెడ్ డా. బిఎస్ శరవణభవ, డా. వెంకటేశ్వర్లు రచించిన టెక్ట్స్ బుక్ ఆన్ క్లినికల్ రీసెర్చ్ పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. వాగ్దేవి కళాశాల ఫార్మ్‌డి ప్రిన్సిపల్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ చంద్రశేఖర్, విశిష్టఅతిథులుగా ప్రముఖ వైద్యులు డా. బి శివసుబ్రమణ్యం, ప్రముఖ ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, శ్రీదేవి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. మమతారెడ్డి, న్యూరోసైకియాట్రిస్ట్ డా. మానస సౌమ్య, కెయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

- ఎంఈఓ రమాదేవి

శాయంపేట : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎంఈఓ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం చిదురాల శశికళ దేవి ఉద్యోగ విరమణ పొందగా శనివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. శశికళ దేవి 20 ఏళ్ల వయస్సులోనే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారని, ఎందరో విద్యార్థుల జీవితాలకు బంగారుబాట వేశారని కొనియాడారు. గ్రామంలో ఉపాధ్యాయులురాలిగా జీవితం ప్రారంభించి నాలుగేళ్లు నర్సంపేటలో విధులు నిర్వర్తించినా మిగిలిన 36 ఏళ్లు శాయంపేట మండలంలో పనిచేసి ప్రధానోపాధ్యాయురాలుగా విరమణ పొందడం అభినందనీయమన్నారు. అనంతరం శశికళదేవి దంపతులను మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌ఓ వెంకటేశ్వర్‌రావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీహరి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాధవి, చంద్రమౌళి, శ్రీలత, మండల అధ్యక్షుడు రాజు, యుగేందర్, ప్రధానకార్యదర్శి బానోతు సుధాకర్ రాథోడ్ పాల్గొన్నారు.



శశికళదేవి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ

పెద్దమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న పూజారులు

వేలేరు : మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలు తిరుపతి దేవస్థాన ఆగమ పండితుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం దిశా హోమం, వాస్తు హోమం, ధాన్య ధివాసం, కుంకుమార్చన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సిద్ధాంతి మత్తగజం సిద్ధేశ్వరశర్మ, వంశీశర్మ, గట్టు మల్లికార్జున ఆలయ అర్చకుడు వినయ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇట్టబోయిన సంధ్య, ముదిరాజ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓట్లడిగే హక్కులేదు



మాట్లాడుతున్న బండి సుధాకర్

ఐనవోలు : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓట్లడిగే నైతిక హక్కులేదని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ అన్నారు. మండలంలోని పంథిని గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిందేమి లేదన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకైన భారత దేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తుందన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చిన బీజేపీ ఉద్యోగాల కల్పనలో విఫలమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ పెద్దలు ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐను ఉసిగొల్పి ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేస్తూ రాక్షసానందం పొందుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండలంలోని పంథిని గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బండి శ్రీనివాస్ (కంకర శ్రీను) కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీపాద సతీష్, అనిల్, సమ్మెట రాజు, పంథిని ఉపసర్పంచ్ మహేందర్, మల్లేశం, ఉప్పు నూతల సమ్మయ్య, యువజన నాయకులు గుర్రపు నిఖిల్, మడూరి రాజు, యాట సంపత్, బండి రమేష్, దంసాని రాము, డాక్టర్ చిర్ర శ్రీనివాస్, చిర్ర రాజు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఉప్పల్ కోల్ డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ కోల్ డంపింగ్ యార్డులో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. కోల్ డంపింగ్ సైడింగ్ లైన్‌లో నిలిపి ఉంచిన బొగ్గు వ్యాగన్‌లో నుంచి దట్టమైన మంటలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు హుటాహుటిన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుజూరాబాద్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. అగ్నిమాపక సిబ్బంది వెళ్లిపోయిన తర్వాత కూడా ఇంకా పొగలు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. కాగా ఉప్పల్‌లోని కోల్ డంపింగ్ యార్డుకు సుమారు నెలన్నర రోజుల క్రితం వచ్చిన ఓ బొగ్గు వ్యాగన్ చెడిపోవడంతో దానిని సైడింగ్ లైన్‌లోనే వదిలేసి పోయారు. ఈ క్రమంలోనే ఎండలు సైతం ముదిరిపోవడంతో సుమారు 15 రోజుల క్రితం ఆ వ్యాగన్ నుంచి మంటలు చెలరేగగా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. శనివారం మరోసారి అదే వ్యాగన్ నుంచి దట్టమైన పొగలు రావడంతో హుజూరాబాద్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసి వెళ్లిపోయారు. ఐనప్పటికీ ఆ వ్యాగన్ నుంచి ఇంకా పొగలు వస్తూనే ఉన్నాయని రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాల్లోని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



బొగ్గు వ్యాగన్ నుంచి వస్తున్న పొగలు

పంటలకు మద్దతు ధర కల్పించాలి

- రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

గీసుకొండ : రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 26న అబ్బనికుంటలో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రైతు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని కోనాయమాకులలో శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర కల్పించలేని దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. సంఘం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి అవగాహన కల్పించి మద్దతు ధర సాధన, ఇతర సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్మించనున్నట్లు తెలిపారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు